సౌండ్‌ తగ్గించమన్నందుకు కుర్చీతో దాడి

గచ్చిబౌలి: చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని పాటల సౌండ్‌ ఆపాలని కోరినందుకు ఓ వ్యక్తి కుర్చీతో దాడి చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్‌ వివరాల ప్రకారం.. ఖాజాగూడలోని లలిత బ్లూమ్‌ఫీల్డ్‌ విల్లాస్‌లో 16 నెంబర్‌ విల్లాలో సూర్య అనే వ్యక్తి నివాసముంటున్నాడు. విల్లా నెంబర్‌ 6లో ఉంటున్న రాజేంద్రన్‌ ప్రతి రోజూ పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెడుతున్నాడు. పాటల శబ్దాలతో చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని సూర్య, అతని కొడుకు రాజేంద్రన్‌ విల్లాలోకి వెళ్లగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాజేంద్రన్‌ కుర్చీతో సూర్యపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గచ్చిబౌలి స్టేడియంలో సంబురాలు



గచ్చిబౌలి: భారత హాకీ జట్టు ఒలింపిక్‌లో కాంస్య పతకం సాధించడంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. శనివారం స్టేడియంలో జూనియర్‌ జాతీయ జట్టు ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా విజయ్‌ మాట్లాడుతూ.. హాకీలో కాంస్య పతకం రావడం రెట్టింపు ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యదర్శి భీమ్‌సింగ్‌ మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 9 నుంచి 18 వరకు జలంధర్‌లో హాకీ జూనియర్‌ జాతీయ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల్‌, సురేందర్‌ సింగ్‌, హుస్సేన్‌, బీస్‌ మహ్మద్‌ పాల్గొన్నారు.

డివిజన్‌ అభివృద్ధికి కృషి



కార్పొరేటర్‌ తారాచంద్రారెడ్డిని సత్కరిస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్‌: డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తున్నానని జీడిమెట్ల కార్పొరేటర్‌ తారాచంద్రారెడ్డి అన్నారు. బృందావన్‌కాలనీ (ఎంఎస్‌నగర్‌ ఆర్య సమాజ్‌) వద్ద సీసీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్‌ సభ్యులు తారాచంద్రారెడ్డిని సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, అశోక్‌గౌడ్‌, మేక ఉమా, సురేందర్‌రెడ్డి, ఝాన్సీ, ప్రభాకర్‌ రెడ్డి, చక్రి, నాగేశ్వర్‌ రావు, విశ్వరుపా చారి, నవీన్‌రెడ్డి, మన్మద్‌రెడ్డి, తక్దీర్‌, కృష్ణమూర్తి, కూన మహేశ్‌గౌడ్‌, మానస్‌, మహేశ్‌, శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌ లయన్స్‌క్లబ్‌ ప్రెసిడెంట్‌ ఎన్నిక



కట్టా కుమారిని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు

రంగారెడ్డినగర్‌: కుత్బుల్లాపూర్‌ లయన్స్‌క్లబ్‌ ప్రెసిడెంట్‌గా రంగారెడ్డినగర్‌ డివిజన్‌ ఆదర్శ నగర్‌కు చెందిన కట్టా కుమారిని ఎన్నుకున్నారు. హెచ్‌ఎంటీ మాక్స్‌ విజన్‌ హైస్కూల్‌లో మేడ్చల్‌ జిల్లా లయన్స్‌ క్లబ్‌ వీసీ ఓబుల్‌రెడ్డి, లయన్‌ వీజీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్‌ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో చేపట్టనున్న సామాజిక సేవా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కె.జయరాం, డి.సత్యనారాయణ, కట్టా రామచందర్‌నాయుడు, విశాల్‌, సాంబశివరావు పాల్గొన్నారు.

బాచుపల్లిలో బోనాల సందడి



నిజాంపేట్‌: బాచుపల్లిలో ఆదివారం శ్రావణమాస బోనాల సందడి నెలకొన్నది. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వివేకానంద్‌, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్‌, మైనంపల్లి హన్మంత్‌రావు, కుత్బుల్లాపూర్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌ ధన్‌రాజ్‌ యాదవ్‌, కొలను గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు కాసాని సుధాకర్‌, ఆగం పాండు, చిట్ల దివాకర్‌ తదితరులు పూజాల్లో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు.

కాసాని వీరేశ్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు..

బోనాల సందర్భంగా యేటా కాసాని వీరేశ్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపును నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన తొట్టెల ఊరేగింపు సైతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



ఏపీ సీఎం చంద్రబాబునాయుడుని ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి దర్శనాలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. – కూకట్‌పల్లి

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు

మంత్రి సీతక్క ప్రకటనతో మహిళా,శిశు సంక్షేమశాఖ కసరత్తు

- టీచర్‌, హెల్పర్‌ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు
- గ్రేటర్‌ సహా శివారు జిల్లాలలో 331 ఖాళీలు
- టీచర్లు, ఆయాల కొరతతో గర్భిణులు, చిన్నారులకు తప్పని వెతలు



గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా టీచర్‌, ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అంగన్‌వాడీల్లో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులతో గర్భిణులు, చిన్నారులకు వెతలే మిగులుతున్నాయి. ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్స్‌ (ఆయా) పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సంబంధిత మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఇటీవల చేసిన ప్రకటనతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

సాక్షి, సిటీబ్యూరో



● అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేయటంతో పాటు గర్భిణులు, చిన్నారుల వెతలు తీర్చుతామని ప్రభుత్వం పేర్కొనటంతో పాటు.. కేంద్రాలకు పంపిణీ చేస్తున్న గుడ్లు ఇతర పౌష్టికాహారంపై సంబంధిత అధికార యంత్రాంగం సీరియస్‌గా వ్యవహరిస్తోంది.

పరిమాణం తగ్గితే వెనక్కి..

తక్కువ పరిమాణం ఉన్న గుడ్లు పంపిణీ చేస్తే వాటిని అధికారులు వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్‌, హెల్పర్‌ (ఆయా) పోస్టుల కోసం గతంలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వాటి పరిశీలన కూడా పూర్తైంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వం ఆదేశాల కోసం ఎదురు చూస్తోంది.

విధుల నిర్వహణలో వీరే కీలకం..

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధులు నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకంగా ఉంటుంది.

1 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు ..

ఒకటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకొస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడి గుడ్లు ఇవ్వటం, అవి తిన్న తర్వాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసిపిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కొందరు పిల్లలు రెండుకు వెళ్తే కూడా వారిని కడిగి తుడిచి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు చెమటలు పట్టి ఏడుస్తూ దిక్కులు చూస్తున్నప్పుడు వారిని సముదాయించాల్సిన పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తారు.

జిల్లా	అంగన్వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్‌	914	1,19,800	167
మేడ్చల్‌	793	95,017	124
రంగారెడ్డి	1600	1,78,797	40
మొత్తం	3,306	3,43,694	331

కేంద్రాల్లో ఖాళీలు ఇలా..

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్‌, హెల్పర్‌ పోస్టులు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా.. టీచర్‌ పోస్టులు 42, హెల్పర్లు 125గా ఉన్నాయి.

- మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్‌ పోస్టులు ఉన్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో టీచర్‌ పోస్టులు 8 , హెల్పర్‌ పోస్టులు 32 ఖాళీలు ఏర్పడ్డాయి.
- గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్‌, హెల్పర్‌ పోస్టుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

18న అవంతినగర్‌ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న లయన్‌ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్‌: అవంతినగర్‌ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు 18న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు లయన్‌ అన్నెం కోటిరెడ్డి తెలిపారు. ఆదివారం మూసాపేట డివిజన్‌లో చిప్స్‌ ఫ్యాక్టరీ ఆవరణలో తక్కలపల్లి దేవేంద్రరావు అధ్యక్షతన కాలనీ రెసిడెన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 12 నుంచి 14వ తేదీ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నామినేషన్‌ పత్రాల స్వీకరణ, 15న నామినేషన్‌ ఉపసంహరణ, 18న మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు కౌంటింగ్‌ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులుగా రమేష్‌చౌహాన్‌, టి.సత్యనాథన్‌ను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో బాకారం బుచ్చయ్య, నరసింహారెడ్డి, అంకం వీరబాబు, సత్యనారాయణ, బి.ఫణికుమార్‌, కిరణ్‌, బండారి సుశీల్‌కుమార్‌ యాదవ్‌, తన్నీరు తిరుపతిరావు, హెచ్‌. అంజిబాయ్‌పటేల్‌ పాల్గొన్నారు.

నారాయణి సిల్క్స్‌ ను ప్రారంభించిన సినీ నటి లావణ్య త్రిపాఠి



లావణ్య త్రిపాఠితో నారాయణి సిల్క్స్‌ డైరెక్టర్లు రాజమౌళి, ప్రసాదరావు, వెంకటేశ్వర్లు, సుజాత

సాక్షి, సిటీ బ్యూరో: కూకట్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన నారాయణి సిల్క్స్‌ లో ప్రముఖ సినీ తార లావణ్య త్రిపాఠి సందడి చేశారు. నగరం వేదికగా 11వ నారాయణి సిల్క్స్‌ ను శనివారం లావణ్య త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీరలు మగువల అందాన్ని మరింత సౌందర్యంగా చేస్తాయని, తన వివాహ వేడుకలో కూడా నారాయణి సిల్క్స్‌ ధరించానని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌ పీ.వీ.ఎస్‌ అభినయ్‌, సురేష్‌ శీర్ష, కేశవ్‌ గుప్తా, రాఖేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు కేన్సర్‌ ఉచిత వైద్య పరీక్షలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు కేన్సర్‌ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్‌ జాహిద్‌ షరీఫ్‌ బాబా ఆదివారం పేర్కొన్నారు. ఓరల్‌, బ్రెస్ట్‌ సర్వికల్‌ కేన్సర్‌ స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 100 మంది వరకు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అధికారులపై విమర్శలు సరికాదు

బాలానగర్‌: కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రొటోకాల్‌ పాటించడం లేదని ఫిర్యాదు చేయడం సరికాదని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే పద్ధతి సరికాదన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే వారిని పార్టీ నుంచి సస్పెండ్‌ చేస్తామని హెచ్చరించారు.

మలబార్‌లో బ్రైడల్‌ జువెలరీ షో



కూకట్‌పల్లి: బంగారు నగల రిటైల్‌ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్‌ గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ కూకట్‌పల్లి షోరూంలో బ్రైడల్‌ జ్యువెలరీ షో ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆగస్టు 10 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. నవవధువుల కోసం కళాత్మకంగా రూపొందించిన ఆభరణాలు ప్రదర్శించనున్నారు. నేటి వధువు కోసం మలబార్‌ గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ ఒక సరికొత్త ధోరణి నెలకొల్పింది. కొత్త పెళ్లి కూతురి అందచందాల నుంచి పొందిన ప్రేరణతో విస్మయపరిచే ఆభరణాల సేకరణలను ఈ ప్రచారంలో భాగంగా ప్రదర్శిస్తున్నామని స్టోర్‌ హెడ్‌ శ్రీనివాస్‌ తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు రూ.80 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌ సంజీవని హనుమాన్‌ దేవాలయం వద్ద గల నల్ల పోచమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించారు. పూజలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుబడ్డ 212 మంది మందుబాబులు

రాయదుర్గం: మద్యం తాగి వాహనాలు నడిపిన 212 మంది పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైబరాబాద్‌ పరిధిలో వీకెండ్స్‌లో చేపట్టిన స్పెషల్‌ డ్రంకెన్‌ డ్రైవ్‌లో 165 ద్విచక్రవాహనాలు, 10 మూడు చక్రాల వాహనాలు, 34 నాలుగు చక్రాల వాహనాలు, 3 భారీ వాహనాల డ్రైవర్లు పట్టుబడ్డారని వీరందరిని హెచ్‌బీఎల్‌ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



చింతల్‌: కుత్బుల్లాపూర్‌ జడ్పీహెచ్‌ఎస్‌లో 2005-06 టెన్త్‌ బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులతో కలిసి నృత్యాలు చేస్తూ సరదాగా గడిపారు. ఉపాధ్యాయులు ఫ్లారాన్స్‌, మహాలక్ష్మి, రూపారాణి, రేణుక, పరిమళ, విజయ, చంద్రశేఖర్‌, బ్రహ్మయ్య, వెంకటయ్యను సత్కరించారు. వినయ్‌, వంశీ, సతీశ్‌, శివ, రామ్‌, ఉపేందర్‌, ప్రసాద్‌, దీప, సువర్ణ పాల్గొన్నారు.

రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో 5కె రన్‌



5కె రన్‌లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఆదివారం 5కె రన్‌ నిర్వహించారు. సర్వైకల్‌ కేన్సర్‌ నివారణకు రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ గత సంవత్సరం నుంచి 2500 మంది వరకు వ్యాక్సినేషన్‌ వేశారు. దీనిలో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న 1500 మంది పిల్లలకు ఉచిత వ్యాక్సినేషన్‌ అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా అవగాహన, రన్‌, వాక్‌ కార్యక్రమాన్ని జనరల్‌, లాప్రోస్కోపిక్‌ సర్జన్‌ డా. శ్రీనివాసులు పచమట్ల ఆధ్వర్యంలో రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ వారు ఏర్పాటు చేశారు. ఈ వ్యాక్సినేషన్‌ కార్యక్రమానికి సహకరిస్తున్న విక్రమ్‌ దేవ్‌, మీరావవి, అపర్ణ రావ్‌, ప్రశాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఈఓ డాక్టర్‌ యోబు, డాక్టర్‌ ఛాయా దేవి, డా. శ్రీనివాసులు, హాస్పిటల్‌ మెడికల్‌ డైరెక్టర్‌ డా. కమలాకర్‌, వైద్యులు లోకేష్‌ రెడ్డి, ఆదిత్య, పావని, మంజుల, సుధారాణి, సుప్రియ, లావణ్య, శృతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నాగరిక వికాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: నాగరిక వికాస్‌ కేంద్రం (రహనుమా సెంటర్‌)ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. శేరిలింగంపల్లిలోని బాపూనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నాగరిక వికాస కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందనే ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవలను కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సెంటర్‌లో టైలరింగ్‌, కంప్యూటర్‌ తరగతుల వంటి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ.. ప్రజల కోసం దశలవారీగా సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్‌ కార్యదర్శి ఇక్బాల్‌ హుస్సేన్‌ తెలుగు రైటర్‌ అబ్దుల్‌ రషీద్‌, నగర అధ్యక్షుడు ముబాషీర్‌ అహ్మద్‌, నిర్వాహికులు, లింగంపల్లి వకీల్‌ అహ్మద్‌, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రెండోరోజూ మెగా జాబ్‌మేళా



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో మెగా జాబ్‌మేళా ఆదివారం కొనసాగింది. దీనికి నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. పరవస్తు క్రియేటివ్‌ ఫౌండేషన్‌, లయన్స్‌ ఇంటర్నేషనల్‌ క్లబ్‌, గ్రీన్‌లాండ్స్‌, రాంకీ ఫౌండేషన్‌, నిపుణ ఎన్‌జీఓ అండ్‌ హెచ్‌ఆర్‌ కో ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగిన జాబ్‌ మేళాకు 11,240 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 105 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. వివిధ కంపెనీల నుంచి 3,100 మంది ఆఫర్‌ లెటర్లు అందుకున్నారు. జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్‌ చాన్సలర్‌ బుర్రా వెంకటేశం, ఐఏఎస్‌, డీసీపీ పి.మధుకర్‌, లయన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ లక్ష్మీ కుమారి, లయన్స్‌ క్లబ్‌ గ్రీన్‌లాండ్స్‌ విద్యాభూషణ్‌, రజని, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ'లో పూర్వ విద్యార్థుల సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ స్వర్ణోత్సవ ఏడాదిలో సిల్వర్‌ జూబ్లీ రీయూనియన్‌ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. 'సెలబ్రేషన్‌ ఆఫ్‌ ఇన్నోవేషన్‌ అండ్‌ ఫ్రెండ్‌షిప్‌' పేరిట ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో 25 ఏళ్ల క్రితం నాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్సెస్‌(ఎస్‌సీఐఎస్‌)లోని ఎంటెక్‌ 1998-99 బ్యాచ్‌ విద్యార్థులు ఆదివారం క్యాంపస్‌లో అడుగిడి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అంతేకాక ఎస్‌సీఐఎస్‌ ప్రొఫెసర్ల ప్రసంగాలు, నెట్‌ వర్కింగ్‌ అవకాశాలపై చర్చలు, పూర్వ విద్యార్థుల తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నాటి ప్రొఫెసర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్‌ దేబాషిస్‌ ఆచార్య, కె.సాయి జవహర్‌, మాజీ ప్రొఫెసర్లు అరుణ్‌ కె పూజారి, ప్రొఫెసర్‌ హృషికేష్‌ మొహంతి, చక్రవర్తిభగవతి, కెఎస్‌మూర్తి, ఎస్‌కేఉద్గత, సల్మాన్‌, పూర్వ విద్యార్థులు, సూర్యనారాయణమూర్తి, ఢిల్లీబాబు, ఉపేంద్రప్రాటూరి, ఎన్‌ వెంకటేష్‌ పాల్గొన్నారు.